# నీట మునిగి వ్యక్తి మృతి

**పాపన్నపేట, జనవరి 2, ప్రభాతవార్త:** ప్రమాదావశాస్తు నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పొడిచన్‌పల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బుట్ట జీవయ్య (63) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. గురువారం గ్రామ శివారులోని మంజీరా నది ఒడ్డున ఉన్న పొలం వద్ద నీరు పారించేందుకు వెళ్లి మోటారు ఆన్ చేయగా పనిచేయకపోవడంతో నదిలోకి దిగి ప్రమాదావశాస్తు నీట మునిగి ఊపిరాడక మృతి చెందాడన్నారు. అటుగా ఉన్న వారు విషయాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంలో మృతదేహాన్ని నీటిలో నుంచి వెలికి తీశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి భార్య కిష్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



# మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి జరిమానా

**గజ్వేల్, జనవరి 2 (ప్రభాతవార్త):**

మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మంది వ్యక్తులకు రూ.14వేల జరిమానా విధించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి పేర్కొన్నారు. గత కొన్ని రోజుల నుండి గజ్వేల్ పట్టణంలోని పిడిచెడ్ రోడ్డు, క్యాసారం ఎక్స్ రోడ్డు, తూప్రాన్ రోడ్డు, ముట్రాజ్‌పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేయగా 20 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నట్లు రిపోర్టు రావడంతో గురువారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ముందు హాజరుపర్చగా విచారణ చేసి 20 మందికి రూ.14వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని, రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.



మాజీ మంత్రి హరీష్‌రావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

## హరీష్‌రావును కలిసిన మున్సిపల్ చైర్మన్

**గజ్వేల్, జనవరి 2 (ప్రభాతవార్త):** సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని గురువారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం అందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

## ఎమ్మెల్సీ కవితను కలిసిన రాజేశ్వర్‌రావు



కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజేశ్వర్‌రావు, మేఘనరాణి

**గజ్వేల్, జనవరి 2 (ప్రభాతవార్త):** నూతన సంవత్సరం సందర్భంగా గురువారం హైద్రాబాద్‌లోని ఎమ్మెల్సీ కవితను బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చెప్యాల రాజేశ్వర్‌రావు మేఘనరాణి దంపతులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## సిఎంను సత్కరించిన కాంగ్రెస్ నేత



సిఎం రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు సాకి ఆనంద్

**సిద్దిపేట అర్బన్, జనవరి 3,ప్రభాతవార్త :** హైదారాబాద్‌లోని సిఎం రేవంత్‌రెడ్డిని గురువారం సిద్దిపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సాకి ఆనంద్ కలిసి శాలువాతో ఘనంగా సత్కారించారు. అనంతరం సిఎం రేవంత్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## సిఎం స్పోర్ట్స్‌కప్‌లో రశ్మితరెడ్డికి రాష్ట్రస్థాయిలో వెండిపతకం

**సిద్దిపేట అర్బన్, జనవరి 2, ప్రభాతవార్త :** సిఎం స్పోర్ట్స్ కప్‌లో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో రాష్ట్ర స్థాయికి రశ్మితరెడ్డి ఎంపికైంది. రాష్ట్రస్థాయిలో జరిగిన అర్చరీలో స్టేట్ లెవల్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. జిల్లా హోంగార్డుల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి కూతురు రశ్మితరెడ్డి అర్చరీలో స్టేట్ లెవల్ సిల్వర్ మెడల్ సాధించడం పట్ల పోలీసు అధికారులు అభినందించారు.

## సిరిచందనకు కాంస్య పతకం

**చిన్నకోడూరు, జనవరి 2, ప్రభాతవార్త :** చిన్నకోడూరు మండలం మెట్టుపల్లి గ్రామా మాజీ సర్పంచ్ సింగిరెడ్డి విజయ వినయ్‌రెడ్డి కూతురు సింగిరెడ్డి సిరి చందన సిఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడ పోటీల్లో షాట్ పుట్ విభాగంలో మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు.

### రాజరాజేశ్వర స్వామి ఆలయ

## హుండీ ఆదాయం రూ 7,99,921

**హుస్నాబాద్ రూరల్, జనవరి 2, ప్రభాతవార్త :** మండలంలోని పొట్లపల్లిలోగల శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కించగా 7,99,921 రూపాయిలు వచ్చినట్లు ఈవో కిషన్‌రావు తెలిపారు. గురువారం నిర్వహించిన హుండీ లెక్కింపు కార్యక్రమం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ పర్యవేక్షణ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిందని వచ్చిన హుండీ ఆదాయాన్ని హుస్నాబాద్‌లోని కెనరా బ్యాంకులో ఆలయ అకౌంట్‌లో జమచేశామన్నారు. ఈ కార్యక్రమంలో గోదాదేవి భజన బృందం, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ హుండీ లెక్కింపు...**

పట్టణంలోని శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ హుండీ లెక్కింపు గురువారం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ పర్యవేక్షణ అధికారి విజయలక్ష్మి, ఈవో కిషన్‌రావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం హుండీఆదాయం రూ.3లక్షల 286 రాగా మిశ్రమ బంగారం 72 గ్రాములు, మిశ్రమ వెండి 8కిలోల 800ల గ్రాములు వచ్చినట్లు వివరించారు.వచ్చిన హుండీ ఆదాయాన్ని హుస్నాబాద్‌లోని యూనియన్ బ్యాంక్ ఆలయ అకౌంట్‌లో జమ చేసినటు చెప్పారు.ఈ లెక్కింపులో ఆయల మాజీ చైర్మెన్ పూదరి లక్ష్మీనారాయణ, పచ్చిమట్ల శ్రీకాంత్‌గౌడ్,శ్రీనివాస్,పూదరి వరప్రసాద్,నర్సాగౌడ్,గోమాతా సేవా పరిషత్ సభ్యులతో పాటు తదితరులు ఉన్నారు.



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది



నాగసాన్‌పల్లిలో మురుగుకాల్వల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిన దృశ్యం



గ్రామాల్లో పేరుకు పోయిన చెత్తా చెదారం దృశ్యం

# పారిశుధ్యానికి పైసల్ లేవు

* పత్తాలేని ప్రత్యేక అధికారులు
* చేతులెత్తేసిన పంచాయతీ కార్యదర్శులు

**పాపన్నపేట, జనవరి 2, ప్రభాతవార్త:**

గ్రామాల్లో పారిశుధ్యం పడకేస్తోంది. నాలుగు నెలలుగా జీవనభృతి చెల్లించకపోవడంతో పారిశుధ్య కార్మికులు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు.ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడంలేదన్న ఆరోపణలున్నాయి. మండలంలో 36 పంచాయతీలు ఉండగా పాలకవర్గం గడువు ముగిసాక ఆర్థికసంఘం, స్టేట్ ఫైనాన్స్ నిధులు విడుదల కాకపోతుండటంతో పంచాయతీ కార్యదర్శులు స్వంత ఖర్చులను భరించుకునే అవకాశం లేకపోవంతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేయక తప్పని పరిస్థితి నెలకొంది.

**ఎన్నికల ముందే ఊడ్చేసి...**

గ్రామపంచాయతీలకు స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి రావాల్సిన నిధులు గత ఏడాదిగా, 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోవడంతోపాటు మూడునెలలకు ఒకమారు రావాల్సిన ఆర్థికసంఘం నిధులను గతప్రభుత్వం ఆపేయడంతో కేంద్రప్రభుత్వం నుంచి నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి జమకావాల్సిన నిధులు గత ప్రభుత్వం పల్లెప్రగతిపథకం ద్వారా విడుదల చేసింది. కేంద్రం నుంచి వచ్చిన నిధులతోపాటు ఎస్ఎఫ్‌సి నిధులను ఎన్నికలముందే ఊడ్చేయడంతో పైసలులేక గ్రామపంచాయతీ పాలన ప్రత్యేక అధికారులు చేతుల్లో గాడితప్పుతోంది.

**జీతాలు లేక...పనులు సాగక...**

గ్రామ పంచాయతీల్లో పనులుచేస్తున్న కార్మికులకు జీతాలు లేకపోవడంతో పనులు చేపట్టేందుకు ముందుకు రాకపోవడంతో గ్రామాలు అపరిశుభ్రతతో దర్శనమిస్తున్నాయి. గ్రామ పంచాయతీల్లో జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం మల్టీ పర్పస్ కార్మికులను నియమించింది. ప్రతి గ్రామం లో 3 నుంచి 12 మంది వరకు పనిచేస్తున్నారు. ప్రతినెల కార్మికులకు రూ. 9500 జీతం నెలనెల చెల్లించాల్సి ఉన్నా, గత 4 నెలలుగా జీతాలు అందక కార్మికులు తమకుటుంబసభ్యులతో అర్థాకలితో అలమటించాల్సిన దుస్థితి నెలకొంది.

**పర్యవేక్షించని ప్రత్యేక అధికారులు...**

ఫిబ్రవరి 1తో పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం ప్రతిగ్రామానికి, మండలానికి జిల్లా, మండల అధికారులను ప్రత్యేక అధికారిగా నియమించిన విషయం విదితమే. ప్రత్యేక అధికారులు తమకు తోచినప్పుడు ఎప్పుడో ఆరు మాసాలకు ఒకమారు అడపాదడపా గ్రామాలను సందర్శిస్తూ వస్తున్నారే తప్పితే, ప్రజలకు అందుబాటులో లేరని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రత్యేక అధికారులు తూతూమంత్రంగా గ్రామాలను సందర్శించడంతో పంచాయతీ వ్యవస్థ గాడి తప్పడం, పంచాయతీలకు నిధులురాక పారిశుధ్యం పడకేయడంతో గ్రామాల్లోని ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

# జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 2 ప్రభాతవార్త:**

ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా గురువారం జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ మెంచు నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, జడ్పీ సీఈవో ఎల్లయ్యలను టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో ఉద్యోగులు రెట్టింపు ఉత్సాహంతో బాధ్యతలు నిర్వర్తిస్తూ శాంతి భద్రతల నిర్వహణలో, ప్రజా సంక్షేమ పథకాలు అమలుపరచడంలో ప్రభుత్వ యంత్రాంగానికి తోడ్పాటు అందించి మెదక్ జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి మినికి రాజ్‌కుమార్, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఎండి. ఫజలుద్దీన్, కోటి రఘునాథరావు, లీల, సంయుక్త కార్యదర్శులు పోతురాజు శంకర్, రాధా, ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, మెదక్, నర్సాపూర్ యూనిట్ల అధ్యక్షులు ఆరేళ్ల రామాగౌడ్,శేషాచారి, టీఎన్జీవోలు శేఖర్, ప్రణయ్, మహేందర్, సత్యనారాయణ, సంగమేశ్వర్ ఉన్నారు.

**మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్**



జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీవోలు

**జిల్లా అధ్యక్షులను కలిసిన ఉద్యోగులు..**

ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మెదక్ జిల్లా టీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు దొంత నరేందర్, మినికి రాజ్‌కుమార్‌లను సహకార శాఖ, వసతి గృహ సంక్షేమ శాఖల ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు ఆరేళ్ల రామాగౌడ్, కె.శేషాచారి, సంగమేశ్వర్, శేఖర్ మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వారివెంట ప్రణయ్, మహేందర్, పురుషోత్తం, ఉద్యోగులు ఉన్నారు.



ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంట నారాయణ తదితరులు

## 10 నుంచి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**మిరుదొడ్డి, జనవరి 2, ప్రభాతవార్త :**

ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఈనెల 10 నుంచి మిరుదొడ్డిలోని శ్రీసీతా రామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని అర్చకులు రాజగోపాల చారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంట నారాయణ తెలిపారు. గురువారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటాలాగా ఈయేడు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. తిప్పొచ్చావ కార్యక్రమాన్ని కనుల పండువగ నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమా వేశంలో ఆలయ కమిటీ సభ్యులు నేరేళ్ల రాజు, మల్లేశం, రాజేశం, వెంకట్ గౌడ్, బిక్షపతి, పర్శు రాములు, మల్లయ్య, వెంకటయ్య, స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

**చిన్నశంకరంపేట, జనవరి 2,ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం, నరేంద్రమోడీ పని చేస్తుందని బిజెపి మండలాధ్యక్షుడు పోగుల రాజు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు నూతన సంవత్సర కానుకగా రైతులకు కిసాన్ సామ్మన్ నిధి ద్వారా 6000 నుండి 10000 రూపాయలకు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం నాడు చిన్నశంకరంపేట పట్టణంలోని చౌరస్తా వద్ద నరేంద్ర మోడి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు కిసాన్ సామ్మన్ నిధి ద్వారా 6000 నుండి 10000 రూపాయలకు పెంచడంతో రైతుల ప్రభుత్వం అని మరోసారి ఋజువైందని, రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని వ్యవసాయం చేసే ప్రతి రైతు కుటుంబంతో కలిసి ఆనందంగా ఉండేందుకు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో యువమోర్చ జిల్లా అధ్యక్షుడు సతీష్, రాములు, వివిధ గ్రామాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిజెపి నాయకులు

# 56 వేల ఉద్యోగాలను భర్తీచేశాం : ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, జనవరి 2 ప్రభాతవార్త:**

నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోపే ఆయా శాఖల్లో 56 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉన్న నిరుద్యోగుల గురించి పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే ఆయా శాఖల్లో 56 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు రూ.17.50 వేల లక్షల కోట్ల 50 అప్పులు చేసి రాష్ట్రాన్ని నట్టేట ముంచిందన్నారు. ఆయా గ్రామాల్లో పనులు చేసిన సర్పంచ్‌లకు బిల్లులు కూడా చెల్లించక పోవడం, విద్యుత్ శాఖలో కూడా 40 వేల కోట్లు కరెంటు బిల్లులు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పులు చేసిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో అంచలంచెలుగా చేసిన అప్పులను చెల్లిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీల పథకాలు అమలు చేస్తుందన్నారు. ఉచిత బస్సు సౌకర్యం,రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను, గ్యాస్ సిలెండర్ రూ. 500 కూడా అమలు చేసిదన్నారు. నారాయణఖేడ్ ప్రాంతం కాంగ్రెస్ హయాంలోనే అనిన రంగాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వినోద్‌పాటిల్, దత్తు, సురేందర్‌పాటిల్, రమేష్‌చౌహన్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జంగరాయి నుండి వెల్దుర్తికి వెళ్లే ప్రధాన రహదారిని కమ్మేసిన పోగమంచు

# కమ్మేసిన పొగమంచు

### ఊటీ అందాలను తలపించిన రహదారి

**చిన్నశంకరంపేట, జనవరి 2,ప్రభాతవార్త:**

మండలంలో పోగ మంచు దట్టంగా ఆవరించింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 10 అయినా మంచు తెరలు తోలగిపోలేదు. జంగరాయి నుండి వెల్దుర్తి వెళ్లే రహదారి పోగ మంచు కమ్మేసి ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో వాహనదారులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగించాయి. బానుడిని రానివ్వకుండా పోగ మంచు చుట్టుముట్టేసింది. చలితో ప్రజలు వణికిపోయారు.

### అంతర్జాతీయ గడుగ్గాయ్ కథల పోటీల్లో

# రామంచ విద్యార్థుల ప్రతిభ

**చిన్నకోడూరు, జనవరి 2, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని రామంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తెలుగు భాష పరిక్షణకు కెనడాలో ఉన్న తెలుగువారు చలవాడ జయశ్రీ లక్ష్మీ రాయవరపు తదితరులు నడిపిస్తున్న అంతర్జాతీయ పిల్లల మాస పత్రిక గుడగాయ్ ఆన్‌లైన్‌లో నిర్వహించిన సంక్రాంతి కథల పోటీల్లో పాల్గొని ప్రత్యేక బహుమతులకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గురువారం తెలిపారు. నగదు, ప్రశంసా పత్రాలు అందజేస్తారని తెలిపారు. శృతి, ఐశ్వర్య, హిందు, అక్షిత,7వ తరగతి, బ్లెస్సి 8వ, సాత్విక్ 9వ, వర్షిణి 10వ, గాయత్రి 10వ తరగతులకు చెందిన విద్యార్థులు బహుమతులు గెలిచారని హెచ్‌ఎం సత్తవ్వ తెలిపారు. కాగా ఉపాధ్యాయులు భాస్కర్, మల్లయ్య, నరేందర్, గంగా భవాని, శ్రీనివాస్, నిర్మల, సంతోషి, జమున, గ్రామస్తులు తదితరులు అభినందించి అశీస్సులు అందించారు.

## నాచగిరి క్షేత్రంలో అర్చకులకు, సిబ్బందికి సన్మానం



ఆలయంలో అర్చకులు, సిబ్బందిని సన్మానించిన దృశ్యం

**వర్గల్, జనవరి 2 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో అర్చకులకు, సిబ్బందికి గురువారం ఆలయ కార్య నిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ మాట్లాడుతూ గత సంవత్సరం కార్తీక మాసంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహించడానికి విశేష కృషి చేసిన ఆలయ అర్చకులతో పాటు సిబ్బందిని స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించడం జరిగిందని తెలిపారు.

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

### ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, జనవరి 2, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే సునీతా రెడ్డి వైద్యులకు సూచించారు. గురువారం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో గాయపడినవారిని నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ శివంపేట మండలం చిన్న గొట్టుముక్కుల శివారులో టాటా ఏసీ ట్రాలీ ఆటో బోల్తా నడగా జరిగిన రోడ్డు ప్రమాదంలో టాటా ఏసీ ట్రాలీ ఆటోలోప్రయాణిస్తున్న 20 మందికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. తీవ్ర గాయాలైన క్షతగాత్రులను నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించాలని ఆమె వైద్యాధికారులకు సూచించారు. అదేవిధంగా తీవ్ర గాయాలైన నలుగురిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వారికి మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్ పావని ని ఆదేశించారు. అంతేగాక ఈ క్షత్రగాత్రుల ఆరోగ్యపరిస్థితి ఎలా ఉందో మెడికల్ ఆఫీసర్ పావనిని ఎమ్మెల్యే సునీతారెడ్డి అడిగి తెలుసుకున్నారు.

## ఎలకుర్తి పల్లెదవాఖానలో వికటించిన వైద్యం...!

### ఆసుపత్రిలో చేరిన వృద్ధురాలు..!!

**టేక్మాల్, జనవరి 2, ప్రభాతవార్త:** రోగం వచ్చిందని పల్లె దవాఖానకు వెళితే మిడిమిడి జ్ఞానంతో వైద్య సిబ్బంది ఇచ్చిన మందులను వేసుకొని ఓ మహిళ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న వైనం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే... టేక్మాల్ మండలం ఎలకుర్తి గ్రామానికి చెందిన పట్లోళ్ల సంగమ్మ(70) గ్యాస్ట్రబుల్‌తో బాధపడుతూ సమీపంలోని పల్లె దవాఖానను ఆశ్రయించింది. అక్కడున్న వైద్య సిబ్బంది నిరక్ష్య వైఖరితో గ్యాస్ ట్రబుల్ సంబంధించిన మందులు ఇవ్వకుండా దురదకు వాడే బెంజిన్ హెక్సా క్లోరైడ్ మందు సీసాను ఇచ్చి తాగమని చెప్పారు. వారు చెప్పినట్టుగానే తాగడంతో, వాంతులు విరోచనాలు చేసుకొని ఆసుపత్రిలో చేరింది. రెండు రోజులుగా మెదక్‌లోని రష్ ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఇందుకుగాను సుమారు 30 వేల రూపాయల ఖర్చు చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వృద్ధురాలు ఆసుపత్రిలో చేరడంపై కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆసుపత్రిలో చేరిన వృద్ధురాలికి ఇచ్చిన మందు సీసా

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : ఎమ్మెల్యే కాలేరు



గోల్నాకలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్,కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త:** అంబర్‌పేట నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఖచ్చితంగా నాణ్యత పాటించాలని నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం గోల్నాక డివిజన్ లో 24లక్షల నిధులతో డ్రైనేజ్ పైప్ లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం కాలేరు వెంకటేష్, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, అధికారులతో కలిసి స్థానిక న్యూఅంబేద్కర్‌నగర్‌లో పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులతో బస్తీలో డ్రైనేజీ సమస్య పరిష్కారం లభించినట్లు అయిందన్నారు. స్థానికంగా ఎక్కడ సమస్యలు నెలకొన్న నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. చేపడుతున్న పనుల్లో నాణ్యత ఉండేలా స్థానిక బస్తీనేతలు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు డిప్యూటీ జనరల్ మేనేజర్ విష్ణువర్ధన్, అసిస్టెంట్ ఇంజనీర్ రోహిత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్,స్థానిక ప్రజలు, బస్తీ నాయకులు,బిఆర్ఎస్ నాయకులుపాల్గొన్నారు.

### గ్రంథాలయాలను పాఠకులకు మరింత చేరువ చేసేందుకు చర్యలు : చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డి



నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డిని సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, జనవరి 2 ప్రభాతవార్త:** గ్రంథాలయలను పాఠకులకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డి అన్నారు. గురువారం అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సత్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజ, నగర గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు చాగంటి అయోధ్య కార్యదర్శి వర ప్రసాద్ అసోసియేటెడ్ ప్రెసిడెంట్ బొల్లం మహేందర్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్ యాదవ్, ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, రమేష్, కోశాధికారి రామ్మోహన్, ప్రతిభారెడ్డి, శుక్లాదేవి, జంగారెడ్డి, జానకిరాములు, సంయుక్త కార్యదర్శులు హరిబాబు, శ్రీనివాసు, శంకర్, మహేష్,ప్రచార కార్యదర్శి సుఖేష్ కుమార్ కార్యనిర్వాహక కార్యదర్శి నరేందర్, నగర గ్రంథాలయ సంస్థ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

### ఆధునిక కాలానికి అన్వయంతో నక్షరాజు గీతా పరిచయం

**చిక్కడపల్లి, జనవరి2 ప్రభాతవార్త:** ఆధునిక కాలానికి అన్వయం తో నక్షరాజు గీతా పరిచయం నిలుస్తుందని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అన్నారు. గురువారం రాత్రి వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో డాక్టర్ వేంకట నక్షరాజు(అమెరికా)చే 'గీతా పరిచయ ప్రసంగ' కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో నిర్వాహక సంస్థ అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం హాజరై డాక్టర్ వేంకట నక్షరాజును సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహక సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ తెన్నేటి సుధాదేవి,మేనేజింగ్ ట్రస్టీ శైలజాసుంకరపల్లి పాల్గొన్నారు.

## ఇందునయనకు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డ్



గాయని ఇందునయన కు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డ్ ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, జనవరి 2 ప్రభాతవార్త:** తెలుగు తమిళ కన్నడ హిందీ మలయాళ భాషల్లో సులువు గా గానం చేయటం లో ప్రతిభావంతురాలు ఇందునయన అని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు ప్రశంసించారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని ప్రధాన వేదిక పై వంశీ ఇంటర్నేషనల్ ( ఇండియా) ఆధ్వర్యంలో భారతీయ సినీ సంగీతానికి పట్టాభిషేకం పేరిట ప్రముఖ గాయకుడు వై ఎస్.రామ కృష్ణ నిర్వహణలో ఇందునయన దక్షిణ భారత భాషా సినిమాలతో పాటు హిందీ పాటలను పాడి ప్రేక్షకులు ప్రశంసలు అందుకున్నారు. అనంతరం వంశీ రామరాజు శాలువా తో ఇందునయనను సత్కరించి వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డ్‌ను బహుకరించి అరుదైన గాయని అని అభివర్ణించారు. వేదిక పై శైలజ సుంకరపల్లి, వై ఎస్ రామ కృష్ణ వ్యాఖ్యాత సుధామయి పాల్గొన్నారు.

## కొత్తేడాదిలో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలి

**- జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి**



కమిషనర్ ఇలంబర్తిని కలిసి జిహెచ్ఎంసి ఉద్యోగులు

**హైదరాబాద్, జనవరి 2,ప్రభాతవార్త:** నగర అభివృద్ధికి ఉద్యోగులకు అంకితభావంతో పనిచేసి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి ఉద్యోగులకు సూచించారు. ఈంమేరకు నూతన సంవత్సరం సందర్భంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం హెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని జోనల్ కమిషనర్లు, వివిధ వభాగాల హెచ్‌వోడిలు, కార్పొరేటర్లు, ఇతర అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ 2024 సంవత్సరం నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించడానికి విజయవంతమైన సంవత్సరం కాగా, కొత్త సంవత్సరం 2025 లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని సంకల్పంతో పని చేయాలన్నారు. కార్పొరేటర్ల ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని కమిషనర్ సూచించారు.

## సమాజాన్ని పట్టిపీడిస్తున్న బాధ్యతారాహిత్యం : హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవానీప్రసాద్



తిరుమల శ్రీనివాసాచార్యను సత్కరిస్తున్న జస్టిస్ భవానీప్రసాద్, కె.వి.రమణాచారి, ఎం.కె.రాము తదితర అతిథులు

**రవీంద్రభారతి, జనవరి 2 ప్రభాతవార్త :** నేడు సమాజాన్ని పట్టిపీడిస్తున్న యువతలో నెలకొన్న బాధ్యతారాహిత్యం దానితోడు సమాజపు కట్టుబాట్లు లోపించడమూ కారణమన్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవానీప్రసాద్ యావత్ ప్రపంచానికే ఆదర్శప్రాయంగా నిలిచిన భారతీయ వసుదైక కుటుంబ వ్యవస్థలో విలువలు, అనుబంధాలు, ఆప్యాయతలు కనుమరుగవుతున్నాయని, దీనంతటికీ ముఖ్యకారణమైన మాదకద్రవ్యాల (డ్రగ్స్) విచ్చలవిడి లభ్యత.... వినియోగమేనని, ఆఖరికి డ్రగ్స్‌రహిత సామజమనే నినాదం ఇవ్వాల్సిన దుస్థితి ఏర్పడిందని తీవ్ర ఆవేదన వ్యక్తపరిచారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వహణలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన ప్రముఖ సాహితీవేత్త ఆచార్య తిరుమల శ్రీనివాసాచార్య 87వ జన్మదిన వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ భవానీప్రసాద్ విశిష్ట అతిథులు మురళీధర్‌గౌడ్, సంస్థ వ్యవస్థాపకుడు డా. ఎం.కె.రాము తదితరులతో కలిసి ప్రముఖ రచయిత తిరుమల శ్రీనివాసాచార్యలను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ప్రసంగించారు. అధ్యక్షోపన్యాసంలో డా. కె.వి. రమణాచారి శ్రీనివాసాచార్య స్వయాన తన చిన్నాన్న అని, ఆయనే ఆదర్శంగా ఓయు నుండి చిన్నాన్న గోల్డ్‌మెడల్ సాధిస్తే తానూ ఆయననే ఆదర్శంగా గోల్డ్‌మెడల్ సాధించినట్లు గుర్తుచేశారు. ఎందరికో గురుతుల్యులైన శ్రీనివాసాచార్య వివిధప్రక్రియల్లో రచనలు చేసిన మహోన్నత సాహితీమూర్తి అని ప్రశంసించారు. సభకు డా. ఎం.కె.రాము స్వాగతం పలుకగా నాగబాల సురేష్ రూపొందించిన శ్రీనివాసాచార్య లఘుచిత్రాన్ని ప్రదర్శించారు.

## సోషల్ మీడియాలో బండ్లగూడ కార్పొరేషన్ రాజకీయం హల్‌చల్

### - ప్యూర్ అండ్ సేఫ్ వాటర్‌ను కార్పొరేషన్ ప్రజలకు అందిస్తాం : మేయర్

**నార్సింగి, జనవరి 2 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ రాజకీయం "సోషల్ మీడియా" వేదికగా హీటెక్కుతుంది. ప్యూర్ అండ్ సేఫ్ మినరల్ వాటర్‌ను బండ్లగూడ కార్పొరేషన్ ప్రజలకు తాగిస్తామని ఓవైపు మేయర్ మద్దెల లతా ప్రేమ్ గౌడ్ ప్రచారం చేస్తున్నారు. దీనికి కౌంటర్‌గానే కార్పొరేటర్ సాగర్‌గౌడ్ శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మురుగు కాలువల నీరు హిమాయత్ సాగర్ జలాశయంలో కలుస్తున్న వీడియోలను సోషల్ మీడియా లో పెట్టి, తాగడానికి ఈ నీరు పనికి రాదన్న అర్థం వచ్చేలా ప్రచారం చేస్తున్నారు. మేయర్, కార్పొరేటర్ ఇరువురూ బిఆర్ఎస్ గుర్తుపై గెలిచి, వివిధ కారణాలతో అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. మొదటి నుంచి ఒకరంటే మరొకరికి పొసగదు. ఒకరు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రధాన అనుచరుడిగా ఉండటం, మరొకరు ఎమ్మెల్యేను ఎదురించి మేయర్ పీఠంను కైవసం చేసుకున్న వారు కావడం గమనార్హం. ఒకరిపై మరొరకు పైచేయి సాధించేందుకు రాజకీయంగా ఎత్తులు, పైఎత్తులు వేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. రాజకీయ భవిష్యత్తు కోసం ఇరువురూ తమదైన పంథాలో ముందుకెళ్తున్నారు. అవకాశం చిక్కినప్పుడల్లా రాజకీయ లబ్ధికోసం పోరాడుతున్నారు. ఇటీవల మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ హిమాయత్ సాగర్ జలాశయం వద్ద ఫిల్టర్‌బెడ్ నిర్మాణం చేపట్టి, హిమాయత్ సాగర్ జలాశయం నీటిని శుద్ధి చేసి కార్పొరేషన్ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించే పనులను ప్రారంభించారు. ఈ పనులను వేగంగా పూర్తి చేయించేందుకు నిత్యం కసరత్తు చేస్తున్నారు. ఇదే విషయంను సోషల్ మీడియా, రాజకీయ వేదికలపై పదేపదే ప్రజలకు చెబుతూ ప్రచారం చేసుకుంటున్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలన్న ఉద్దేశంతో కార్పొరేటర్ సాగర్‌గౌడ్ హిమాయత్ సాగర్ జలాశయంలోకి శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మురుగు నీరు కలిసే వీడియోలు తీసి, సోషల్ మీడియా లో పెట్టారు. హిమాయత్ సాగర్ జలాశయాలు తాగేందుకు పనికి రావని, మురికి నీరు కలుస్తుందని తనదైన పంథాలో ప్రచారం ప్రారంభించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం, గండిపేట మండలం, బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలోని అన్ని సోషల్ మీడియా గ్రూపుల్లో ఇద్దరి మధ్య డైలాగ్ వారే హల్‌చల్ చేస్తుంది. రెండున్నరన దశాబ్దాలుగా హిమాయత్ సాగర్ జలాశయం నీటిని స్థానికంగా ఉన్న బండ్లగూడ కార్పొరేషన్‌కు ఇవ్వకుండా, హైదరాబాద్‌కు తరలించుకు పోయారని, ప్రభుత్వంలోని పెద్దలందరిని కలిసి, ఒప్పించి బండ్లగూడకు నీరు వచ్చేలా చేశామని మేయర్ లతాగౌడ్ వివరించారు. ఇందుకు అవసరమైన పనులు కూడా ప్రారంభించామని, త్వరలోనే నీటిని కార్పొరేషన్ ప్రజల చేత తాగించేందుకు రేయింబవళ్లు కష్టపడుతున్నామని, ఇందుకు సంతోషించి, సహకరించాల్సింది పోయి ప్రజలలో అపోహ కలిగించే కుట్ర చేయడం దారుణమన్నారు. హిమాయత్ సాగర్ నీటిని అన్ని రకాలుగా ఫిల్టర్ చేసిన తరువాతనే జల మండలి అధికారులు ఒకే చెప్పిన తరువాతనే ప్రజలకు తాగేందుకు సరఫరా చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మేయర్, కార్పొరేటర్ల పోటాపోటీ ప్రచారాలను గమనిస్తున్న కార్పొరేషన్ ప్రజలంతా దీనిపైనే చర్చించుకుంటున్నారు.

## అపార్ట్‌మెంట్లలో సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి : పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ





హేమసాయి లేక్‌టవర్స్ అపార్ట్‌మెంట్‌లో సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి, జనవరి 2 ప్రభాతవార్త** శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని అన్ని గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్స్‌లలో సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలని శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ సూచించారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్లలోని హేమసాయి లేక్ టవర్స్ అపార్ట్‌మెంట్స్‌లో 53లక్షల రూపాయలతో నూతనంగా ఏర్పాటు చేసిన 116 కిలోవాట్స్ రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్‌ను పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిలో సహజసిద్ధమైన వనరులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తరిగిపోతున్న వనరుల తరుణంలో సహజ సిద్ధమైన సౌర శక్తిని వాడుకుని సద్వినియోగం చేసుకుంటూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. 116 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుచేసిన తొలి అపార్ట్‌మెంట్ ఇదే కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. హేమసాయి వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రిప్రగడ సత్యనారాయణ రావు, హేమసాయి లేక్ వ్యూ టవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరీశ్ దామరాజు,ఉపాధ్యక్షులు అరవింద్‌రెడ్డి, శెక్రటరీ శ్రీనివాస్ వోలేటి, కోశాధికారి ఒరాజన్ బాబు,కార్యదర్శి పరిమళ సాహు, అడిషనల్ సెక్రటరీ ప్రతాప్, అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### జీడిమెట్ల పారిశ్రామిక వాడలో అగ్ని ప్రమాదం

**జీడిమెట్ల, జనవరి 2, ప్రభాతవార్త** హైదరాబాద్ మహానగరంలోని జీడిమెట్ల పారిశ్రామిక వాడలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం తెల్లవారుజామున వాణి కెమికల్ కంపెనీ ముందు ఓ లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అందులో హార్డ్వేర్ సామాగ్రిని తరలిస్తున్నట్లు సమాచారం. రన్నింగ్ లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో డ్రైవర్ అప్రమత్తమై ఒక్కసారిగా దానిని రోడ్డు పక్కన నిలిపివేసినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. ఎందుకంటే ఫైర్ యాక్సిడెంట్ జరిగిన ప్రదేశంలో ప్లాస్టిక్ తయారీ కంపెనీలు ఉన్నట్లు తెలుస్తోంది. నిప్పు రవ్వలు ఎగసి పడినట్లు అయితే మరో ఘోర ప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

### మన సంస్కృతి,సంప్రదాయాలకు పండుగలే ప్రతీకలు : సాయిబాబా



చందానగర్‌లో ముగ్గులపోటీలలో పాల్గొన్న మహిళలు

**శేరిలింగంపల్లి, జనవరి 2 ప్రభాతవార్త** మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలే పండుగలని కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు,గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని 35 కాలనీలలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ప్రతి కాలనీలో పోటీలలో గెలుపొందిన మహిళలకు ప్రథమ, ద్వితీయ,తృతీయ,ప్రొత్సహాతక బహుమతులను అందజేశారు. ఇందులో భాగంగా చందానగర్ డివిజన్ పరిధిలోని వెంకటాద్రి కాలనీ లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు కొమిరిశెట్టి సాయిబాబా, ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ మాట్లాడుతూ.. పరిశుభ్రత, ఆరోగ్యం, అలంకరణల మేళవింపే ముగ్గులని అన్నారు. ముగ్గుల పోటీల వలన మహిళలల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసే అవకాశం ఉంటుందన్నారు. పోటీలలో పాల్గొన్న విజేతల ఎంపికలో తాటిచర్ల వరలక్ష్మీ,అనూషాలు న్యాయనిర్ణేతలుగా వ్యవహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళ నాయకురాలు కుమారి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యురాలు ఉమా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలి : ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ



లడఖ్ ఎంపి మహ్మద్ హనీఫా జాన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రజా అలీ మీర్జా

**చార్మినార్,జనవరి 2 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతనగరం వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించవలసిన అవస రం ఎంతైనా ఉందని చార్మినార్ నియోజకవర్గం ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ అన్నారు.ది హైదరాబాద్ కట్ పీస్ క్లాథ్ మర్చంట్స్ అసోసియేషన్,అగర్వాల్ శిక్షా సమితిల సంయుక్త ఆధ్వర్యంలో రికాబ్‌గంజ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మంచి నీటి వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతబస్తీకి చెందిన వ్యాపారుల సమస్యలను పరిష్కరించ టానికి కృషి చేస్తానని తెలి పారు.పాతబస్తీలో ప్రధానమైదని పార్కింగ్ విషయమని ఈవిషయాన్ని ఎంపి అసదుద్దీన్ ఓవైసీ,శాసన సభ పక్ష నాయకులు అక్బరుద్దీన్ ఓవైసీ దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అగర్వాల్ శిక్షా సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ కేడియా,ది హైద రాబాద్ కట్ పీస్ క్లాథ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు అజయ్ కుమార్ చనానియా, అసోసియేషన్ ప్రతినిధులు ఎం. సునీల్ కుమార్ అగర్వాల్,టి.సునీల్,శేషు కుమార్ అగర్వాల్, కపూర్ చంద్ గుప్తా,విజయ్ కుమార్ అగర్వాల్,రవీందర్ అగర్వాల్, డాక్టర్.మోహన్ గుప్తా పాల్గొన్నారు.

### రజా అలీకి బెస్ట్ సోషల్ అవార్డు ప్రధానం

**చార్మినార్,జనవరి 2 ప్రభాతవార్త :** పాతబస్తీ దారుషిఫాలో యామ్ ఇస్లామిక్ ఛానల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లడఖ్ ఎంపి మహ్మద్ హనీఫా జాన్ నూర్‌ఖాన్ బజార్‌కు చెందిన తెలంగాణ తాజ్ మహిళా వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ రజా అలీ మీర్జాకు బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు అందుకున్న రజా అలీ మీర్జా మాట్లాడుతూ తెలంగాణ తాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నలభై సంవత్సరాలుగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు.కార్యక్రమంలో యామ్ ఇస్లామిక్ ఛానల్ చైర్మన్ హాసిం అలీ మీర్జాతో పాటు పలువురు పాల్గొన్నారు.

# వడ్డెరలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సదస్సులో నినాదాలు చేస్తున్న అఖిల భారత వడ్డెర, వోడ్, బోవి, బేల్దార్ సంక్షేమ సంఘం నేతలు

**ముషీరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కూడా వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అఖిల భారత వడ్డెర, వోడ్, బోవి, బేల్దార్ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐఎన్‌టియూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదసుకు తెలంగాణ ఎంబీసీ చైర్మన్ జెరిపాటి జైపాల్, అఖిల భారత వడ్డెర, వోడ్, బోవి, బేల్దార్ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్‌లతో కలసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ వడ్డెర్లు, ఎరుకల, యానాది, లంబాడీలు, డిఎన్‌టి సంచార జాబితాలో ఉన్నారని, 1970 అనంతరం ఏర్పడిన కమీషన్ ఎరుకుల, యానాది, లంబాడీలను ఎస్‌టీ(గిరిజన తెగలు)లో చేర్చి, లిపి లేని కారణంగా వడ్డెరలను బీసీ ఏ లో చేర్చి, తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ ఏలో ఉండటం వల్ల మన రాష్ట్రంలో వడ్డెర్లు సామాజికంగా, ఆర్థికంగా, ఉన్నత విద్య, రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్నారని, కొన్ని రాష్ట్రాలలో వడ్డెర్లు ఎస్సీ, ఎస్టీ జాబితాలో ఉండటం వల్ల అక్కడ వడ్డెర్లు అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో 35లక్షల మంది వడ్డెర జనాభా ఉన్నప్పటికీ, గత ప్రభుత్వాలు అన్యాయం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టులలో సొసైటీలకు సాల్వెన్సీ లేకుండా క్లాస్ 2 వరకు రిజిస్ట్రేషన్స్ చేయాలని, ఇఎండి లేకుండా ప్రభుత్వ రంగ సంస్థలలో 25శాతం రిజర్వేషన్ పనులు కేటాయించాలని కోరారు. 50 ఏళ్ల వయసు నిండిన వడ్డెరలకు నెలకు 4వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని, మైనింగ్ లో వడ్డెర కో ఆపరేటివ్ సొసైటీలకు 30శాతం రిజర్వేషన్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఎంబీసీ చైర్మన్ జెరిపాటి జైపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు వడ్డెరలకు తీవ్ర అన్యాయం చేశాయని ఆరోపించారు. వడ్డెరల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్ మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా వడ్డెర జాతికి అన్యాయం జరుగుతోందని, వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు వేముల తిరుమలాదేవి, ప్రధాన కార్యదర్శి గుంజ రేణుక, యువజన విభాగం జాతీయ అధ్యక్షులు మంజుల రమేష్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మంచపు రమ, సంఘం ఉపాధ్యక్షులు మంజల హనుమయ్య, కార్మిక విభాగం అధ్యక్షులు సాతల గోపాల్, ప్రధాన కార్యదర్శి ఇడగోటి నగేష్, ఇతర నాయకులు ఇడగోటి పార్వతి, బొంత చిరంజీవి, బోదాసు శ్రీనివాస్, రేపన్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి పనిచేసే వారికే డివిజన్ అధ్యక్ష పదవి

**-కార్పొరేటర్ పావనీ వినయకుమార్**



ప్రసంగిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్

**చిక్కడపల్లి, జనవరి 2 ప్రభాతవార్త:** కష్టపడి పనిచేసే వారికె డివిజన్ అధ్యక్ష పదవి వరిస్తుందని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ అన్నారు. గురువారం అశోక్‌నగర్ కల్చరర్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ లో గాంధీనగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ డివిజన్ అధ్యక్ష పదవికి ఆశావహులు, అర్హుల వివరాలను సేకరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్, రిటర్నింగ్ అధికారి రవి ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు. సమావేశంలో కార్పొరేటర్ పావనీ వినయకుమార్ మాట్లాడుతూ గాంధీనగర్ డివిజన్ నుండి అధ్యక్ష పదవికి అయిదు గురి పేర్లను పరిశీలనలోకి వచ్చాయని, అందులో బీజేపీ ఓబీసీ మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్,డివిజన్ ఉపాధ్యక్షుడు నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి నర్సింహ,ఓబీసీ మోర్చ సోషల్ మీడియా నగర కార్యవర్గ సభ్యుడు ధోనేటి సత్యం, యువమోర్చ నియోజకవర్గం కో కన్వీనర్ ఆనంద్‌రావు ల పేర్లను బీజేపీ రాష్ట్ర కార్యవర్గానికి పంపడం జరుగుతుందని తెలిపారు. ఐదు గురినుండి ఒక్కరినీ మాత్రమే డివిజన్ అధ్యక్షుడిగా పార్టీ నిర్ణయిస్తుందని,పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కార్పొరేటర్ వివరించారు.పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా కృషి చేయాలని, ఈ సందర్భంగా కార్పొరేటర్ పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు రత్న సాయి చంద్,బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమేష్ రామ్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, దామోదర్, డివిజన్ లోని బూత్ అధ్యక్షులు,బూత్ కో ఆర్డినేటర్ లు,వివిధ మోర్చ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

### సిఎంను కలిసిన పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన శాలిబండ డివిజన్ కంటెస్టెడ్ కాంగ్రెస్ కార్పొరేటర్ తిరుపతి చందూ

**యాకుత్‌పుర,జనవరి 2 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని గురువారం పాతబస్తీకి చెందిన శాలిబండ డివిజన్ కంటెస్టెడ్ కాంగ్రెస్ కార్పొరేటర్ తిరుపతి చందూతో పాటు పలువురు కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

## ఎత్తుకు పై ఎత్తే చదరంగం



**అత్తాపూర్ జనవరి2,ప్రభాతవార్త :** ఎత్తుకు పై ఎత్తు వేస్తేనే చదరంగంలో రాణించగలరని రాజేంద్రగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు ఎం. ప్రభాకరాచారి, ప్రధానకార్యదర్శి జి. శరవణ్ కుమార్ విద్యార్థులకు సూచించారు. రాచరిక పాలనలో ఒక రాజ్యాం రాజును తన భటులతో ఇతర రాజును సైన్యంతో ఏ విధంగా కట్టడి చేసే వారో నేడు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చెస్ క్రీడ ఉదహరిస్తుందని వారు చెప్పారు. గురువారం మండల స్థాయి అంతర ప్రైవేట్ పాఠశాలల క్రీడోత్సవాల్లో భాగంగా గురునానక్ స్కూల్లోని దర్మేష్ ఆడిటోరియంలో సబ్ జూనియర్, జూనియర్ విభాగాల చెస్ క్రీడా పోటీలను వారు జిల్లా సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ ఎ. యాదగిరి, మండల సంఘం కోశాధికారి ఎస్ఆర్. రజినీకాంత్, క్రీడలు, సంస్కతిక కార్యదర్శులు వేణుగోపాల్, బోయ లక్ష్మణ్ లతో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చదరంగం ఆటలో మేదాశక్తి ఉపయోగించాల్సి ఉంటుందన్నారు. చదరంగం ఆట పై విజ్ఞాన పరిజ్ఞానం కలిగి ఉండడంతో పాటు వ్యూహాత్మక ఎత్తులు వేయాలన్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థి క్రీడా కళానైపుణ్యాన్ని తప్పక ప్రదర్శించాల్సిందేనని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు రాజేంద్రప్రసాద్, కరుణాకర్, మధుసూధన్, మహ్మద్ వాజిద్, శేషు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఖానామెట్ ఈదులకుంటను పరిశీలించిన హైడ్రా

**శేరిలింగంపల్లి, జనవరి 2 ప్రభాతవార్త** శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లోని ఈదులకుంట ఆనవాళ్లను హైడ్రా వెలికితీస్తుంది. సర్వేఆఫ్ ఇండియా సహాకారంతో గురువారం సర్వేచేయించి హద్దులను నిర్ధారించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఖానామెట్-కూకట్‌పల్లి గ్రామాల సరిహద్దుల్లో ఉన్న ఈ చెరువు మాయమయ్యిందని స్థానికులు ఫిర్యాదులు చేయటంతో హైడ్రా రంగంలోనికి దిగింది. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌కు చెందిన హై రిజల్యూషన్ మ్యాప్‌ల ఆదారంగా చెరువు ఆనవాళ్లను హైడ్రా ఇదివరకే గుర్తించింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నెలక్రితం క్షేత్రస్థాయిలో పర్యటించి చెరువు ఆక్రమణలు జరుగుతున్న తీరును పరిశీలించారు.ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు చెందిన వారు .. సదరు స్థలం తమదంటున్న వారితో పాటు ఫిర్యాదు చేసిన స్థానికులను హైడ్రా కార్యాలయానికి పిలిపించి హైడ్రా ఉన్నతాధికారులు విచారించారు. సైబర్‌సిటి వద్ద వంతెన నిర్మాణంతో గతంలో తుమ్మిడికుంట -ఈదులకుంట మద్య ఉన్న వరద కాలువ మూసుకుపోయిందని, ఆ చెరువు లోనికి నీరు రాకపోవడంతో మట్టితో నింపి కబ్జాలకు పాల్పడ్డారంటూ విచారణలో ఫిర్యాదుదారులు ఆధారాలతో బహిర్గతం చేశారు. ఖానామెట్-కూకట్‌పల్లి గ్రామాల సరిహద్దుల్లో ఉండటంతో సులభంగా చెరువును ఆక్రమించారంటూ స్థానికులు పిర్యాదు చేశారు. ఈ నేపద్యంలో సర్వేఆఫ్ ఇండియాను హైడ్రా రంగంలోనికి దించింది. సర్వేఆఫ్ ఇండియా టోపో మ్యాప్ ప్రకారం పూర్తిస్థాయిలో గురువారం సర్వేచేయించింది. ఖానామెట్,కూకట్‌పల్లి విలేజ్ మ్యాప్‌ల ఆదారంగా అక్కడ ఈదుల కుంట చెరువు ఉందని సర్వే ఆఫ్ ఇండియా నిర్ధారించింది. అదే విధంగా ఎఫ్‌టీఎల్,నీటి విస్తరణ ప్రాంతాలను కూడా గుర్తించింది.ఈ సర్వేలో హైడ్రా అధికారులతో పాటు ఇరిగేషన్ శాఖాధికారులు, రెవెన్యూ అదికారులు, జీహెచ్ఎంసీ,హెచ్ఎండీఏ అధికారులు ఉన్నారు.

### సమస్యలు పరిష్కరించేందుకు కృషి : ముఠా జైసింహ

**ముషీరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** ముషీరాబాద్‌లో ఏ సమస్యలు ఉన్నా పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ హామీ ఇచ్చారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌లోని భరత్‌నగర్ లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ఏఈ మురళితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొండా శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్, దీన్‌ద యాళ్‌రెడ్డి, శ్రీశైలం యా దవ్, గంటల రాజు, టెంట్ శ్రీని వాస్, క్రాంతి, పరమేష్ చారి, శ్రీకాంత్ యా దవ్, కార్తీక్ యాదవ్, సాయి యాద్^వ్, గోరఖ్‌నాథ్ పాల్గొన్నారు.

## మాజీమంత్రి సబితా రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టు నాయకులు



**అత్తాపూర్ జనవరి2,ప్రభాతవార్త :** రాష్ట్ర మొదటి విద్యా శాఖ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు పి సబితా ఇంద్రారెడ్డిని రాజేంద్రనగర్ సర్కిల్ జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. టీయూడబ్ల్యూజే రాజేంద్రనగర్ సర్కిల్ అధ్యక్షులు ఎం దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర జర్నలిస్టు నాయకులు ఏ భీమయ్య, టి యు డబ్ల్యూ జే మాజీ అధ్యక్షులు ఏం ప్రేమ్ రాజ్, జర్నలిస్టులు వర్కాల చందు, కోరని మహేష్ లు సబితా రెడ్డి, బి ఆర్ ఎస్ రాజేంద్రనగర్ ఇంచార్జ్ పి కార్తీక్ రెడ్డి లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సబితా రెడ్డి మాట్లాడుతూ... జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

### వ్యవసాయ విశ్వవిద్యాలయంలో న్యూయర్ వేడుకలు



**అత్తాపూర్ జనవరి2,ప్రభాతవార్త :** కొత్త సంవత్సర వేడుకలు రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఘనంగా జరిగాయి. గురువారం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య కేక్ కట్ చేశారు. సిబ్బంది అందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అందరి కృషితో డిసెంబర్ లో నిర్వహించిన విశ్వవిద్యాలయ వజ్రోత్సవ ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించగలిగామని ఆయనన్నారు. భవిష్యత్తులోనూ విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడానికి అందరూ పునరంకితం అవ్వాలని జానయ్య పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పిఆర్‌టియు నాయకులు

## పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

**మిరుదొడ్డి, జనవరి 2, ప్రభాతవార్త:** ఉపాధ్యాయల సమస్యలను పరిష్కరించడంలో పిఆర్‌టియు ఎప్పుడు ముందుంటుందని సంఘం మండల అధ్యక్షుడు సిద్ధి వెంకటేష్ అన్నారు. పిఆర్‌సి 50 శాతం పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో గురువారం మండల విద్యాశాఖ అధికారి అంజాగౌడ్ పిఆర్‌టియు నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న డిఎలు విడుదల చేయాలన్నారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి హెల్త్‌కార్డుల జారీకి చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిఆర్‌టియు అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి గెలుపు కోసం సైనికుల్లా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో పిఆర్‌టియు మండల ప్రతినిధులు చంద్రం, చంద్రారెడ్డి, నర్సింహారెడ్డి, బాలకిషన్ భగవాన్, మధుసూదన్‌రెడ్డి, హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రవిశేఖర్ పాల్గొన్నారు.

### పటాన్‌చెరులో...



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

**పటాన్‌చెరు, జనవరి 2, ప్రభాతవార్త:** శ్రీశ్లోక ఇంటర్నేషనల్ పాఠశాలకు సంబందించిన నూతన సంవత్సర క్యాలెండరును బొల్లారం మున్సిపల్ పరిధిలోని శ్రీశ్లోక ఇంటర్నేషనల్ పాఠశాలలో కేవిఆర్ పాఠశాల, శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాల కరెస్పాండంట్ కొత్వాల్ హరికృష్ణరెడ్డి ఉపాధ్యాయలతో కలిసి ఆవిష్కరించారు.

## నైపుణ్య శిక్షణతో ఉద్యోగావకాశాలు



బ్యాంకు మేనేజర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**చిన్నశంకరంపేట, జనవరి 2, ప్రభాతవార్త:** విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలంటే నైపుణ్యశిక్షణ ఎంతో అవసరమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శశిధర్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓజెటి కార్యక్రమంలో భాగంగా ఒకేషనల్ విద్యార్థులకు వివిధ బ్యాంకుల్లో జరిగే లావాదేవిలపై అవగాహన కల్పించారు. నేటి పోటీప్రపంచంలో విద్యార్థులకు ఒకేషనల్ స్కిల్స్, నైపుణ్యాలు, టెక్నాలజీ ఉపయోగంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. విద్యార్థులకు అన్నిరకాల నైపుణ్యాలను నేర్పించిన తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ యోగానంద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మీపతి, శ్రీవాణి, విక్రమ్, ఇంద్రారెడ్డి, తిరుపతి, గణేష్ పాల్గొన్నారు.

### సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

**గజ్వేల్, జనవరి 2 (ప్రభాతవార్త):** ఆర్ అండ్ ఆర్ కాలనీ పల్లెపహాడ్ గ్రామానికి చెందిన శనిగరం బిక్షపతికి మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు సహకారంతో మంజూరైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్‌ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, యువజన విభాగం అధ్యక్షుడు స్వామిచారి, కౌన్సిలర్ బొగ్గుల చందు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మెప్మా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న

**హుస్నాబాద్ రూరల్, జనవరి 2, ప్రభాతవార్త :** ప్రజలు మెప్మా సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత వెంకన్న అన్నారు. గురువారం పట్టణంలోని 15వవార్డుకు చెందిన మహ్మద్ ఖయ్యం ఇటీవల ఉపాధి కల్పన కోసం మున్సిపల్ కార్యాలయంలోని మెప్మ సెక్షన్ లో దరఖాస్తు చేసుకోగా అధికారులు ఎస్‌బిఐ నుండి రూ 2లక్షల 60 వేల రుణంతో ఆటోను కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ఆటోను మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారుడికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు ప్రణీత్, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్, మాజీ ఎంపిపి ఆకుల వెంకట్, మెప్మ టిఎంసి ముత్యాల రాజు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ రవికుమార్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి : సిఐ వాసుదేవరావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

విద్యార్థులు చెడు ఆలోచనలకు తావివ్వకుండా క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు అన్నారు. జిల్లాకేంద్రంలోని విద్యావర్ధిని హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, గుడ్‌టచ్ బాడ్‌టచ్, గంజాయి, ఇతర మత్తుపదార్థాలు, ఈవిటీజింగ్, నూతన చట్టాల పై సీపీ డాక్టర్ అనురాధ ఆదేశాల మేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దన్నారు. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించే లింకులు ఓపెన్ చేయొద్దన్నారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే జాతీయ సైబర్ సెల్ హెల్ప్ లైన్ నంబరు 1930 కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట షీ టీమ్ నంబరు 8712667434 కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మోహన్, ఉపాధ్యాయులు, సిద్దిపేట షీటీమ్ బృందం కిషన్, ఎఎస్ఐ, మహిళ కానిస్టేబుల్ మమత, కానిస్టేబుళ్ల ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వన్ టౌన్ సిఐ వాసుదేవరావు

# సిబిసితో గీతం వర్సిటీ ఒప్పందం



ప్రభుత్వ కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ తో కేఎస్ పీపీ అవగాహన

**పటాన్‌చెరు, జనవరి 2, ప్రభాతవార్త:**

భారతప్రభుత్వంలోని కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ (సిబిసి)తో గీతండీమ్డ్‌విశ్వవిద్యాలయంలోని కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కెఎస్‌పిపి) గురువారం న్యూఢిల్లీలోని సిబిసి కార్యాలయంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వంలోని మానవ వనరుల నిర్వహణాపద్ధతులను మెరుగుపరచడం, భారతదేశంలోని 2.5కోట్ల పౌరసేవకుల సామర్థ్యాన్ని బలోపేతంచేసే లక్ష్యంతో ఈనాలెడ్జ్ భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకుంది. ఈ అవగాహనా ఒప్పందంపై సంతకాల కార్యక్రమంలో, కెఎస్‌పిపి తరపున డీన్, పూర్వరాయబారి సయ్యద్ అక్బరుద్దీన్, డాక్టర్ షరీక్ హసన్ మనజీర్, సిబిసి ప్రతినిధి బృందంలో మానవవనరుల విభాగం సభ్యుడు డాక్టర్ ఆర్. బాలసుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శి ఎస్.పి. రాయ్, ఇతర అధికారులు రాహుల్ పోర్వాల్, నికితాసురానా తదితరులు పాల్గొన్నారు. మానవవనరుల అభ్యాసాలు, సామర్థ్యాన్ని పెంపొం దించే కార్యక్రమాలను చేపట్టడం ద్వారా భారతదేశం అమలు సామర్థ్యాన్ని సమూలంగా పెంచాలని లక్ష్యమించింది. ఈ అంశంలో సిబిసి ముందంజలో ఉండి, వివిధ మంత్రిత్వశాఖల పరిధిలోని విభాగాల కోసం సామర్థ్యాలను పెంపొందించే ప్రణాళికలను రూపొందించి, అమలు చేయడానికి కృషి చేస్తోంది. దీని కోసం సిబిసి సమగ్రమైన ముందుచూపుతో కూడిన వ్యూహాలను అభివృద్ధి చేయడానికి ప్రముఖ సంస్థలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకుంటోంది. ఈనాలెడ్జ్ పార్టనర్‌షిప్ కింద, కెఎస్‌పిపి భారతదేశం నుంచి పాలనా విధానాలు, ప్రపంచ ఉత్తమ అభ్యాసాలను మిళితంచేసే భారత దేశ కేంద్రీకృత కేస్ స్టడీస్, నిజసమయ విధాన అనుకరణ (రియల్ టైమ్ పాలసీ సిమ్యులేషన్)తో సహా వాటికి అనుగుణమైన అభ్యాస వనరులను అందిస్తుంది. ప్రవర్తనా నైపుణ్యాల శిక్షణతో పాటు నైతిక నిర్ణయాధికారం, నాయకత్వం, డిజిటల్ పాలనతోపాటు యోగ్యత ఆధారిత మాడ్యూల్స్ పై దృష్టిసారిస్తూ అధునాతన శిక్షణా కార్యక్రమాలను అభివృద్ధి చేస్తుంది. సమగ్ర అవసరాల విశ్లేషణలను కూడా కెఎస్‌పిపి నిర్వహించడంతో పాటు, ప్రభుత్వ పనితీరు లక్ష్యాలతో శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయడానికి పాత్ర ఆధారిత యోగ్యతాపటాలు, అంతరాల విశ్లేషణ సాధనాలను కూడా సృష్టిస్తుంది. చొరవ ప్రభావాన్ని అంచనా వేయడానికి, విధాన ఆవిష్కరణ ప్రయోగాలను చేయడానికి, డేటా ఆధారిత అంతర్‌దృష్టులను రూపొందించడానికి ఈ సహకారం, శిక్షణకు ముందు, ఆతరువాత అంచనాలను కలిగి ఉంటుంది. అంతేకాక, ప్రభుత్వ అధికారుల కోసం ఆన్‌లైన్, హైబ్రిడ్ కోర్సులను రూపొందించడానికి, దాని డిజిటల్ మౌలిక సదుపాయాల రూపకల్పనలను కెఎస్‌పిపి చేస్తుంది. అందుబాటులోని, ప్రభావవంతమైన అభ్యాస పరిష్కారాలను కూడా నిర్ధారిస్తుంది. కెఎస్‌పిపి సిబిసి మధ్య ఈ భాగస్వామ్యం, కేంద్రప్రభుత్వ పాలనలో విప్లవాత్మక మార్పులకు, భారతదేశ పౌర సేవల సామర్థ్యాన్ని పెంపొందించడానికి భాగ స్వామ్య నిబద్ధతకు ప్రతీక. పబ్లిక్‌పాలసీ ఎడ్యుకేషన్ లో కెఎస్‌పిపి నైపుణ్యాన్ని, సామర్థ్య నిర్మాణానికి బలమైన విధానాలు రూపొందించడానికి సిబిసి మిషన్‌ను ఉపయోగించడం ద్వారా సహకారం, ప్రభావవంతమైన, స్థిరమైన ఫలితాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది.

## విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** జిల్లాలో కొత్త మెనూ ప్రకారం, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్ లో ఎస్సి, బిసి, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో కొత్త మెనూ ను పాటిస్తూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హాస్టల్స్‌లో ప్రతి రోజు నూతన మెనూ ప్రకారం నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు రుచి కరమైన వంట చేయడం కోసం అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడము, వంట సామాగ్రి ఏర్పాటు, వంటకు ఉపయోగించే సరుకులు కూరగాయలు అన్నింటిలో నాణ్యత పాటించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. శాఖల వారిగా రేట్ చాట్ ప్రాకారం కొత్త మెనూ పాటించాలని అధికారులకు ఆదేశించారు. హాస్టల్స్ లో మైనర్ రిపైర్స్ పూర్తి చేయాలనీ, విద్యార్థులకు త్రాగునీరు, మరుగు దొడ్లు, ఫ్యాన్స్, కిటికీలు, డోర్స్ అన్నింటిని పూర్తి చేయాలనీ ఆదేశించారు.

**కుక్కల బెడద నివారణపై చర్యలు**

జిల్లాలో కుక్కల బెడద నివారణపై కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో కుక్కల బెడద నివారించడానికి జిల్లాలోని 4 మున్సిపాలిటీలలో 4 ఏబీసీ సెంటర్స్ నెలకొల్పి స్థానిక పశువైద్యులచే కుక్కల జనన నియంత్రణ ఆపరేషన్స్ చేశామని అన్నారు. ఇప్పటి వరకూ 700 వరకు వీధి కుక్కలలో జనన నియంత్రణ ఆపరేషన్స్ పశు వైద్యులు చేశారని తెలిపారు. వీది కుక్కలను పట్టడానికి ఆంధ్రా ప్రాంతానికి చెందిన అనుభవజ్ఞులైన వ్యక్తులను నియమించామని, పట్టిన కుక్కలను ఉంచడానికి 4 సెంటర్లలో ఒకొక్క చోట 50 కుక్కలను పెట్టడం కోసం ప్రత్యేక బోనులు తయారుచేయించి అందులో కుక్కలను విడివిడిగా ఉంచి జనన నియంత్రణ ఆపరేషన్లు చేయించడం జరుగుతుందన్నారు. ఆపరేషన్స్ తర్వాత 5 రోజుల వరకు ఆహారం నీరు మందులు ఇచ్చి ఆ తర్వాత వాటి ప్రాంతలలో విడిచిపెడతారని తెలిపారు. అదనపు కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుదీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీఓ శ్రినివాస్, ఎస్సి అభివృధి అధికారి మల్లేశం, బీసీ అధికారి ఉపేందర్, గిరిజిన సంక్షేమ అధికారి కమలాకర్ రెడ్డి, మైనార్టీ అధికారి హనుమంతరావు పాల్గొన్నారు.

### సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**శామీర్‌పేట, జనవరి 2, ప్రభాతవార్త** నగరం నుంచి శామీర్‌పేట వరకు మెట్రో రైల్ ప్రాజెక్టును పొడిగించినందుకు పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేసి సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గురువారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలో సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పలువు రు హర్షం వ్యక్తం చేసి సిఎం రేవంత్‌రెడ్డికి దన్యవాదాలు తెలియజేశారు. మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి. నర్సింలు యాదవ్, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎబ్లాక్ అధ్యక్షులు జి. వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర హాజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబ్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు బి. జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు వై. శంకర్‌గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తుంకి రమేశ్, మాజీ ఎంపిటిసి సభ్యులు ఎస్. అశోక్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్, కాంగ్రెస్ నాయకులు ఎం. మహేందర్‌యాదవ్, ఎం. శ్రీనివాస్‌రెడ్డి, గౌస్‌బాబ, యాదగిరి, భాను పాల్గొన్నారు.

### మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన మహ్మద్ అలీఖాన్ బాబర్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (జనవరి 2) :** మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌ను షాద్‌నగర్ మార్కె ట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్ గురువారం మర్యాదపూర్వకంగా కలు సుకున్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు రఘు నాయక్, మొహమ్మద్ ఇబ్రహీం, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అలీం సఖిబ్‌లు ఆయన ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మైనార్టీల నిధులు, పథకాల గురించి మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌తో చర్చించినట్లు వారు తెలిపారు.

## పేదలకే పక్కా ఇళ్లు కేటాయిస్తా : ఎమ్మెల్యే

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జనవరి 2 :** గ్రామాల్లో ఇల్లు లేని నిరుపేదల వద్ద స్వయంగా వెళ్లా వాళ్లకు ఇండ్లు ఇప్పిస్తానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో ఇందిరమ్మ గృహాల సర్వే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, తదితర పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో పేద ప్రజల వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనే మహిళతో ఆయన స్వ యంగా మాట్లాడి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఇళ్లు లేని వారికి ఇళ్లు వచ్చే విధంగా ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మీడియాతో మాట్లాడుతూ వచ్చే నెల నుండి పేదలకు సోనామసూరి బియ్యం అందిస్తామని అన్నారు. గతంలో ఇచ్చిన ప్రభుత్వ బియ్యం బాగలేని కారణంగా పేదలు ఎం తో మంది వాటిని తినలేక ఇతరులకు ఇచ్చారని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మంచి బియ్యాన్ని అందిస్తామన్నారు. ఈ అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో విస్తృతంగా తీసుకువెళ్లాల న్నారు. ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీలు ప్రభుత్వంపై విపరీతంగా దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని, అందుకు తగిన విధంగా మన ప్రచారం ఉండాలని ఆయన పార్టీ వర్గాలకు సూచించారు.

### 4న మధురాపురానికి మంత్రి సీతక్క రాక

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జనవరి 2 :** జనవరి 4వ తేదీన ఫరూఖ్‌నగర్ మండలం మధురాపురం గ్రామంలోని వివిధ సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లు రాబోతున్నట్లు షాద్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గండ్రాతి బా ల్‌రాజ్ గౌడ్ తెలిపారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం మధురాపురం గ్రామంలో బాల్‌రాజ్ గౌడ్‌తో పాటు మాజీ ఎంపీటీసీ భార్గవ కుమార్ రెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్, తదితరులు గ్రామంలో పర్యటించారు. ఇందులో భా గంగా గ్రామంలో దాదాపు సీఆర్‌ఎస్ గ్రాంట్స్ నుండి రూ.8 కోట్ల నిధులతో కమ్మదనం నుండి మధురాపురం, శేరిగూడ గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మహిళా సమాఖ్య భవనం, కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించనున్నట్లు వివరించారు.

ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసిన దుండగులను శిక్షించాలి

## ఉపాధ్యాయుల రక్షణకై ప్రత్యేక చట్టం తీసుకురావాలి

### టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జనవరి 2 :** రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాములుపై అయ్యప్ప దుండగులు దాడికి పాల్పడ్డారని, వారిపై వెంటనే చర్యలు తీసుకొని దాడి చేసి అయ్యప్ప మూకలపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాలని, తక్షణమే ఉపాధ్యాయుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి ప్లకార్డులతో నిరసన చేపట్టారు. విద్యార్థులకు విద్యను బోధించే ఉపాధ్యాయుడితోనే విద్యార్థి కాళ్లు మొక్కించడం, అసభ్య పదజాలంతో దూషించడం, విచక్షణారహితంగా దాడి చేయడం దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నామని, ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడికి పాల్పడ్డ వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోకపోతే ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు వెంకటయ్య, నర్సింలు, ఫరూఖ్‌నగర్ మండల ప్రధాన కార్యదర్శి బి. సత్యం, నాయకులు నర్సింలు, కృష్ణ, లక్ష్మీదేవమ్మ, సమత, జ్యోతిర్మయి, అరుణ, శేఖర్ గౌడ్, సురేందర్, శివరాములు, రవికుమార్, రాములు, మహేష్, డీటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ సైదా

## విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి : సిఐ సైదా

**గజ్వేల్, జనవరి 2 (ప్రభాతవార్త):** విద్యార్థి దశ కీలకమని, జీవితంలో మళ్లీ ఎప్పుడూ రాదని ఏది సాధించాలన్నా ఇప్పటి నుండే ప్రణాళికలు తయారు చేసుకోవాలని గజ్వేల్ సిఐ సైదా పేర్కొన్నారు. గురువారం ప్రగతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిస కావద్దన్నారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకోవడం వల్ల భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని, పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. కష్టపడి చదవాల్సిన వయసులో చెడు అలవాట్లకు బానిస కావద్దని సూచించారు. నూతన చట్టాలతో మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగిందని, నూతన చట్టాలలో నేరం చేసిన నేరస్తులకు కఠిన శిక్షలు అమలుచేయడం జరుగుతుందన్నారు. బాధితులకు అండగా చట్టాలు నిలుస్తాయని పేర్కొన్నారు. మహిళలు, పిల్లల పట్ల ఎవరైనా హింసకు పాల్పడినా, హేళనగా మాట్లాడినా మౌనం వీడి తల్లిదండ్రులకు లేదా స్నేహితులకు లేని పక్షంలో డయల్ 100కు కాల్‌చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. మహిళల, పిల్లల రక్షణకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మెట్టయ్యచౌదరి, అధ్యాపకులు, షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ లావణ్య, కానిస్టేబుల్ మహేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్ టౌన్, జనవరి 2 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డుకు చెందిన బయ్యనగారి పెద్దరాములు అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట వార్డు కౌన్సిలర్ బొగ్గుల చందు, బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు నర్సింలు, ఎల్లం, ఆంజనేయులు, నర్సయ్య, చంద్రయ్య, స్వామి, జగన్, రంగారావు, యాదయ్య, ప్రభుదాస్ ఉన్నారు.

### విద్యార్థులకు కంటి పరీక్షలు

**చిన్నశంకరంపేట, జనవరి 2, ప్రభాతవార్త:** మండల పరిధి కామారం తండా, మిర్జాపల్లితండా, చందంపేటలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లయన్స్ క్లబ్ మౌలాలి వారి సహకారంతో కంటి పరీక్షలను చేయించారు. చికిత్స అవసరం ఉన్నవారికి భాగ్యనగరంలోని ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని, కంటి అద్దాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యుడు ఎమ్మెస్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

### ఎమ్మెల్యే కాలె యాదయ్య

**నవాబుపేట జనవరి 2, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యానందించాలని చెవేళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హులైన ఉపాధ్యాయులుంటారని వారితోనే సాధ్యమని అన్నారు. గురువారం పులుమామిడి ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ తరగ తిగదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజి టల్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి సూచించారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అందుకోసం ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లితండ్రుల తోడ్పాటు అందించాలని అన్నారు. పీఏసీఎస్ చైర్మన్ పోలీసు రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్, ఎంఈవో అబ్దుల్ రహమాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎంపి అరుణకు బిజెపి నేతల శుభాకాంక్షలు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జనవరి 2 :** 2025 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్ బీజేపీ నాయకులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి గురువారం మహబూబ్‌నగర్ ఎంపీ డి. కె. అరుణను ఆమె స్వగృహంలో కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 50 శాతం పోలింగ్ బూత్ కమిటీలు పూర్తి చేసి, జిల్లా పార్టీకి అందజేయాలని సూచించినట్లు తెలిపారు. ఎంపీ అరుణను కలిసిన వారిలో బీజేపీ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, విజయ భాస్కర్, మోహన్ సింగ్, పసుల నర్సింహ్మా యాదవ్, శివారెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, చేగు సుధాకర్, మల్‌రెడ్డి మహేందర్ రెడ్డి, అత్తాపురం మహేందర్ రెడ్డి, కృష్ణ, గడ్డమీది రాజు, ఇంద్రసేనా రెడ్డి, బాల్‌రెడ్డి, పాండు రంగారెడ్డి, వన్నం శ్రీనివాస్, చౌడం శ్రీనివాస్, కల్వకోలు తిరుపతి తదితరులు ఉన్నారు.

### ఎంపి అరుణను కలిసిన బిజెపి నేతలు

**కేశంపేట జనవరి 2 ప్రభాతవార్త** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామానికి చెందిన బిజెపి నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా ఎంపీ డీకే అరుణ ను ఆమె నివాసంలో కలిశారు. గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు నిధులను మంజూరు చేయాలని బిజెపి నేతలు కోరారు అందుకు సానుకూలంగా స్పందించిన ఆమె సంక్రాంతి తరువాత గ్రామానికి వస్తానని గ్రామంలో ఉన్న సమస్యలను పరిశీలించి సరిపడ నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. బిజెపి సీనియర్ నాయకులు పసుల నరసింహ యాదవ్, కల్వకోలు తిరుపతి, మాడమోని శ్రీనివాస్ గౌడ్, సురేష్, చెన్నయ్య పాల్గొన్నారు.

### వ్యక్తిపై దాడి..కేసు నమోదు

**ఘట్‌కేసర్, జనవరి 2, ప్రభాతవార్త:** లారీ ఆపి ఓవ్యక్తిపై దాడి చేసిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ బహుదూర్‌పురకు చెందిన మహమ్మద్ ఒమర్ అతని డ్రైవర్ సల్మాన్‌తో కలిసి యాదాద్రిభువనగరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగు నుంచి అశోక్ లేలాండ్ ట్రాలీ (టిఎస్12యుడి-4810)లో హైదరాబాద్‌కు వస్తుండగా ఘట్‌కేసర్ బైపాస్ రహదారి ఎదులాబాద్ రోడ్డు వియూపి వద్దకు రాగానే ఇద్దరు యువకులు ట్రాలీని ఆపారు. మేడిపల్లికి చెందిన పవన్, ఘట్‌కేసర్‌కు చెందిన వినయ్‌కృష్ణలు బుల్లెట్ బైక్‌పై వెనుకాల వస్తూ ట్రాలీని ఫాలో చేశారు. వీరిద్దరు అండర్‌పాస్ వద్ద ట్రాలీని ఆపి ఒమర్‌తో వాగ్వివాదానికి దిగడంతో ఘర్షణ జరిగింది. దీంతో ఒమర్‌ను కొట్టగా పవన్ అనుచరులు కాళీసింగ్, దీపక్‌సింగ్, కేదర్‌సింగ్, పవన్‌రెడ్డిలు కూడా వచ్చి ఒమర్‌పై దాడి చేశారు. ఈమేరకు బాధితుడు ఒమర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, జనవరి 2, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్, అంకుశాపూర్ విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో శుక్రవారం నిర్వహణ పనుల కారణంగా కరెంట్ సరఫరాకు అంతరాయ ం కల్గుతుందని ఏఈ బి. యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ 33/11 కేవీ ఉపకేంద్రం పరిధిలోని ఘట్‌కేసర్ పట్టణం, శివారెడ్డి గూడ, ఘణాపూర్, యంనంపేటలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యా హ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. అంకుశా పూర్ 33/11 కేవీ ఉపకేంద్రం పరిధిలోని ఎన్‌ఎఫ్‌సి నగర్, మాదారం, అంకు శాపూర్, చందుపట్లగూడ, బొక్కోనిగూడ, ఎదులాబాద్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు కరెంట్ ఉండదని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఏఈ కోరారు.

# అంగరంగ వైభవంగా లేగదూడకు డోలాహరణం



లేగ దూడకు డోలాహరణ కార్యక్రమం నిర్వహిస్తున్న రైతు దంపతులు, వారి కుటుంబ సభ్యులు

**సాంప్రదాయ బద్ధంగా 21రోజుల ఉయ్యాల పండుగ**

**నోరూరించే వంటకాలతో బంధు మిత్రులకు పసందైన భోజనాలు**

**వికారాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** వారసుడు పుట్టాడంటే చాలు ఆ కుటుంబంలో సంతోషం అంతా ఇంతా కాదు. మగ పిల్లాడు పుడితే బంధు మిత్రులను పిలిచి ఉయ్యాలలో వేసి భారీ కార్యక్రమం చేస్తారు. విందుకు వచ్చిన వారు ఔరా అనిపించేలా నోరూరించే వంటకాలు వండి భోజనాలు పెడతారు. అదే తీరుగా ఓ రైతు కుటుంబంలోని దంపతులు సైతం తమ లేగదూడను ఉయ్యాలలో వేసి డోలోత్సవం నిర్వహించారు. మగ పిల్లాడో..ఆడ పిల్లనో పుడితే ధోలాహరణ విందు చేయడం పరిపాటే. ఇక్కడ లేగ దూడకి దోలాహరణం చేసి బంధు మిత్రులకు పసందైన భోజనాలు పెట్టారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం ఎన్కతల గ్రామంలో చోటు చేసుకుంది. ఎన్కతల గ్రామానికి చెందిన రైతు కుమ్మరి అంజయ్య, కమలమ్మ దంపతులకు పశువులంటే అమితమైన ప్రేమ. వీరు గత నాలుగు సంవత్సరాల క్రితం సంగారెడ్డి జిల్లా సదాశివపేట్ మండలం తంగడిపల్లి గ్రామంలోని కోటి బిల్వ లింగేశ్వర్ ఆశ్రమం నుంచి ఓ ఆవు ని తెచ్చుకుని పెంచుకుంటున్నారు. ఆవుని ఎంతో మురిపెంగా చూసుకుంటూ కుటుంబంలోని మనిషిలా పెంచుకుంటున్నారు. ఆవుకి ఇప్పటి వరకు 3 ఆడ లేగలు పుట్టాయి. వాటిని తిరిగి కోటి బిల్వ లింగేశ్వర ఆశ్రమానికి దానంగా ఇచ్చారు. 4వ సారి ఆ గోవు లేగ దూడ కి జన్మనిచ్చింది. దీంతో ఆ రైతు దంపతుల ఆనందానికి అవధులు లేవు. ఇంటిలో మగ పిల్లాడు జన్మిస్తే ఎంత సంబరపడతారో..అంతకంటే రెట్టింపు రీతిలో సంబర పడ్డారు. అంతటితో ఆగకుండా మగ శిశువు జన్మిస్తే 21 రోజులకు ఏ విధంగా ధోలాహరణం చేస్తారో..అదే తీరుగా లేగదూడకు సైతం ఘనంగా ధోలాహరణం కార్యక్రమం నిర్వహించారు. బంధు మిత్రులను పిలిచి ముత్యైదువులతో పాటలు పాడించి ఊయలలో లేగ దూడను పడుకో బెట్టి జోల పాటలు పాడారు. ఆ లేగ దూడ సైతం మగ పిల్లాడు ఊయలలో ఎలా ఊగుతూ బంధువుల పాటలు వింటాడో..అదే తీరుగా ఊయలలో పరుండి బందువుల పాటలను వింటూ ధోలా హరణ కార్యక్రమానికి తాను అర్హుడనే అనే తీరుగా వ్యవహరించింది. ఈ ధోలా హరణ విందుకు బందువులే కాకుండా ఈ విచిత్రాన్ని చూసేందుకు గ్రామస్తులు సైతం అధిక సంఖ్యలో తరలివచ్చి లేగ దూడ ధోలాహరణ కార్యక్రమాన్ని కన్నులార తిలకించారు. వచ్చిన బంధువులకు, అతిథులకు ఆ రైతు దంపతులు సాదరంగా స్వాగతం పలికి, పసందైన వంటకాలతో భోజనాలు వడ్డించారు. దీంతో వచ్చిన వారు కడుపార భోజనాలు చేసి, లేగ దూడ చేసుకున్న అదృష్టాన్ని అందరు ముచ్చటించుకున్నారు. మరికొందరు ఒకింత ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ విందు ఆరగించి ఇళ్ళకు వెళ్ళిపోయారు.

# వార్డుల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం

## మున్సిపల్ చైర్మన్ గురుస్వామి అశోక్ గౌడ్



వార్డులో నుండి వెళుతున్న సాగుకాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గురుస్వామి అశోక్‌గౌడ్

**నర్సాపూర్, జనవరి 2, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మున్సిపాలిటీలోని పలువార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ గురుస్వామి దుర్గప్పగారి అశోక్‌గౌడ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 6,7 వార్డుల్లో బోర్ మోటార్‌లేక నీటిసమస్య నెలకొనగా వార్డు ప్రజలు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వార్డుప్రజల వినతిమేరకు ఈవార్డుల్లో నూతనంగా బోరుమోటర్‌ను ఏర్పాటుచేసి నీటి వసతి కల్పించినట్లు తెలిపారు. ఇదేవార్డులో రాయరావు చెరువు నుండి వెళుతున్న సాగునీటి కాలువ అపరిశుభ్రంగా ఉండడంతో ఆకాలువను కూడా పరిశీలించినట్లు తెలిపారు. ఈకాల్వను పరిశుభ్రం చేయడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. అంతేగాక ఐదోవార్డులో సిసి రోడ్లు లేనందున సిసి రోడ్ల నిర్మాణంకు నిధులు కేటాయించి సిసి రోడ్లను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈమేరకు నర్సాపూర్ పట్టణంలోని అన్నివార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని మున్సిపల్ చైర్మన్ గురుస్వామి దుర్గప్పగారి అశోక్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గురుస్వామి అశోక్‌గౌడ్‌తోపాటు మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్, కౌన్సిలర్ సంఘసాని సురేష్. నీటిపారుదలశాఖ ఏఈ మనుభూషణ్, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేతకి ఆలయాన్ని దర్శించుకున్న మాజీచైర్మన్



కేతకి ఆలయాన్ని దర్శించుకుంటున్న టిఎస్ఎస్‌సిసిడిసి మాజీచైర్మన్ నరోత్తం

**ఝరాసంగం, జనవరి 2, ప్రభాతవార్త:**
రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ మాజీచైర్మన్ వై.నరోత్తం గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న నరోత్తంను ఆలయమర్యాదలతో స్వాగతం పలుకగా అమృతగుండంలో పాదప్రక్షాళనచేసుకుని ఆలయంలోని గర్భగుడిలో అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా నరోత్తం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నరోత్తంను ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు చేసి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు బసయ్యస్వామి, రికార్డ్ అసిస్టెంట్ రమేష్, నాయకులు శంకర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మేషన్ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన



బైపాస్ ఫార్మేషన్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, జనవరి 2, ప్రభాతవార్త:**
మున్సిపల్ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలోని హన్మారెడ్డి సమాధి నుంచి కంగ్టి రోడ్డును కలిపే బైపాస్‌రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ రోడ్డునిర్మాణం పూర్తయితే నారాయణఖేడ్ పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. రోడ్డునిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ సమస్య తొలగుతుందన్నారు. పట్టణంలో కొద్దిరోజుల క్రితం టియుఐఎఫ్‌డిసి పథకంలో 20కోట్ల నిధులతో డ్రైనేజి కాలువలు, సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. నారాయణఖేడ్ మున్సిపల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగేలా తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ ఆనంద్‌స్వరూప్ శెట్కార్, వైస్‌చైర్మన్ దారం శంకర్‌సేట్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, హనుమాండ్లు, రాజేష్ చౌహాన్, రామకృష్ణ, వివేకానంద, సద్దాం, సయ్యద్, నర్సింలు, తాహెర్, వినోద్‌పాటిల్, రమేష్‌చౌహాన్, పండరిరెడ్డి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

## వర్కింగ్ ప్రెసిడెంట్‌కు మాజీఎమ్మెల్యే శుభాకాంక్షలు



కెటిఆర్‌కు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ టౌన్, జనవరి 2, ప్రభాతవార్త:**
బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హైద్రాబాద్‌లోని బిఆర్ఎస్ కార్యాలయంలో నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీపరిస్థితిపై మాజీమంత్రి మాజీ ఎమ్మెల్యేను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## సొంతఖర్చులతో మల్గి మల్లన్నగట్టుపై బోరు



సొంత ఖర్చులతో బోరును డ్రిల్ చేయిస్తున్న కొలన్ నరసింహారెడ్డి

**న్యాల్‌కల్, జనవరి 2, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని మల్గిగ్రామంలోని మల్లన్నగట్టుపై భక్తుల దాహార్తి తీర్చేందుకు కొలన్ నరసింహారెడ్డి గురువారం స్వంతఖర్చులతో బోరును డ్రిల్ చేయించారు. భక్తుల సౌకర్యార్థం సొంతనిధులు వెచ్చించి బోరును డ్రిల్ చేయించిన కొలన్ నరసింహారెడ్డిని మల్గిమల్లన్న ఆలయకమిటీ అధ్యక్షులు, మల్గిగ్రామ మాజీసర్పంచ్, మండలసర్పంచులు మాజీ అధ్యక్షులు జెట్గొండ మారుతి, మాజీసర్పంచ్ భూమారెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు శ్రీపతి శివానంద్, మాజీ ఉపసర్పంచ్ రాజు, మాజీవార్డుసభ్యులు సిద్ధారెడ్డి, విఠల్, ఆలయకమిటీ బాధ్యులు వైద్యనాథ్, ప్రతాపరెడ్డి, మాణిక్, నగేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం



అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు

**కొల్చారం, జనవరి 2, ప్రభాతవార్త:**
కొల్చారం మండలపరిధిలోని పోతంశెట్టిపల్లి చౌరస్తాలోని హనుమమ్మ గార్డెన్‌లో గురువారం కొల్చారం మండల బిజెపి ఇన్‌ఛార్జి వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు, మండల నాయకుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీర్‌రెడ్డి, మండల అధ్యక్షులు దయాకర్ గౌడ్, బిజెవైఎం మండల అధ్యక్షుడు హరీష్, మండల ప్రధానకార్యదర్శి నాని, మండల ముఖ్యనాయకులు, శక్తికేంద్రం ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, క్రియాశీలక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అనువుగా ఆర్టీసి సేవలు

### -డిపో మేనేజర్‌ను సన్మానించిన కళాశాల బాధ్యులు



ఆర్టీసి డిపో మేనేజర్‌ను సన్మానిస్తున్న కళాశాల బాధ్యులు

**నాగల్‌గిద్ద, జనవరి 2, ప్రభాతవార్త:**
విద్యార్థులకు సమయానుగుణంగా (విద్యాలయాలకు చేరుకునేందుకు) ఆర్టీసి సేవలు అందిస్తున్నామని నారాయణఖేడ్ ఆర్‌టిసి డిపో మేనేజర్ మల్లేషయ్య అన్నారు. మండలపరిధిలోని మోర్గిగ్రామంలోని మోడల్ కళాశాలలలో గురువారం డిపోమేనేజర్ మల్లేషయ్యను కళాశాలబాధ్యులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా డిపోమేనేజర్ మల్లేషయ్య మాట్లాడుతూ మండలంలోని ఆయాగ్రామాల నుంచి మోర్గి మోడల్ కళాశాల, పాఠశాలకు చేరుకునే విద్యార్థులకు సమయానుకూలంగా ఆర్టీసిబస్సులను నడుపుతున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణ, కళాశాల బాధ్యులు, విద్యార్థులు ఆర్టీసి మార్కెటింగ్ ఇంచార్జి పాండు తదితరులు ఉన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

**నర్సాపూర్, జనవరి 2, ప్రభాతవార్త:**
నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డికృషితో మంజూరైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కును బాధితులకు మండలపరిధిలోని నాగులపల్లిగ్రామంలో మాజీ సర్పంచులు సేనాధిపతి, జీవన్‌రెడ్డిలు బాధితుడికి పంపిణీచేయడం జరిగింది. ఈమేరకు నాగులపల్లిగ్రామానికిచెందిన తాళ్ల లలిత వైద్యఖర్చులనిమిత్తం సిఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తుచేసుకోగా, ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో మంజూరయ్యాయి. చెక్కును మాజీసర్పంచులు జీవన్‌రెడ్డి, సేనాధిపతిలు బాధితురాలుకొడుకు రాజుకు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సేనాధిపతి జీవన్‌రెడ్డిలతోపాటు టిఆర్ఎస్ యూత్‌ప్రెసిడెంట్ శ్రీనివాస్, గ్రామనాయకులు ముకుందంరెడ్డి, జలీల్, రామస్వామి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

**నర్సాపూర్, జనవరి 2, ప్రభాతవార్త:**
నర్సాపూర్‌పట్టణంలోని ఆవుల రాజిరెడ్డి క్యాంపుకార్యాలయంలో గురువారం శివ్వంపేటమండలం కొంతాన్‌పల్లిగ్రామానికిచెందిన బాపుగౌడ్‌కు, నర్సాపూర్ పట్టణానికిచెందిన సయ్యద్‌రఫీకి చెక్కులను పిసిసి ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి చేతులమీదుగా బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం..

**కొల్చారం, జనవరి 2, ప్రభాతవార్త:**
ఓ వివాహిత అదృశ్యమైన ఘటన కొల్చారం మండలపరిధిలోని చిన్నఘనపూర్‌లో చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన చాకలి జ్యోతి(26) తనభర్త చాకలి శ్రీనివాస్ రోజూ మద్యంసేవించి వేధించేవాడని, ఈక్రమంలో వేధింపులు ఎక్కువకావడంతో ఇంటినుండి ఆధార్‌కార్డు తీసుకొని వెళ్లిపోయింది. చిలప్‌చెడ్ గ్రామానికిచెందిన జ్యోతికి 10సంవత్సరాలక్రితం చిన్నఘనపూర్‌కుచెందిన చాకలి శ్రీనివాస్‌తో వివాహం జరగగా నలుగురు కొడుకులు పుట్టగా, ఇద్దరు కొడుకులు మృతిచెందినట్లు జ్యోతి బాబాయ్ కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## లారీ బైక్ ఢీ-ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి కారణమైన లారీ దృశ్యం

**చౌటకూరు, జనవరి 2, ప్రభాతవార్త:**
లారీ బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయాలకు గురైన సంఘటన మండలకేంద్రమైన చౌటకూరు జాతీయరహదారి 161పై చోటుచేసుకుంది. ఎస్ఐ క్రాంతిపాటిల్ కథనం ప్రకారం, ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. రేగోడ్ మండలం గజవాడ గ్రామానికి చెందిన యువకులు యశ్వంత్, ప్రశాంత్‌లు ద్విచక్రవాహనంపై సంగారెడ్డికు వెళుతున్నారు. సరాపల్లి ఫ్లైఓవర్‌పైన ఆగి ఉన్న లారీని అతివేగంగావచ్చిన ద్విచక్రవాహనం బలంగా ఢీకొంది. ప్రమాదంలో యశ్వంత్ తీవ్రగాయాలకు గురికాగా 108 వాహనంలో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమచికిత్స అందించి మెరుగైనచికిత్స కొరకు హైద్రాబాద్‌లోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ప్రశాంత్‌కు స్వల్పగాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## పొయ్యిలో పెట్రోల్ పోయడంతో మంటలు

### -శంషారెడ్డిపల్లి తండాలో బాలుడికి తీవ్ర గాయాలు

**వెల్దుర్తి, జనవరి 2, ప్రభాతవార్త:**
పొయ్యిలో పెట్రోల్ పోయడంతో మంటలు అంటుకుని బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన వెల్దుర్తి మండలం శంషారెడ్డిపల్లి తండాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, వెల్దుర్తిమండలం శంషారెడ్డిపల్లి తండాకు చెందిన సునావత్ పోత్య కుమారుడు సునావత్ సంజీవ్ (14) బుధవారంరాత్రి ఇంటిముందు పోయిపై వంటచేస్తుండగా బైక్ నుంచి బాటిల్‌లోకి తీసిన పెట్రోల్‌ను పొయ్యి మండించడానికి పోశాడు. దీంతో పెట్రోల్ ఒక్కసారిగా పెద్ద మండి సంజీవ్ గొంతు, ఛాతి, చేతులు కాలి తీవ్ర గాయాలు అయ్యాయి. 108 ఈఎన్‌టీ శివ, పైలట్ శ్రీనివాస్ వెంటనే వెళ్లి బాలుడికి ప్రథమచికిత్స అందించి వైద్యంకోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో సర్వీస్ రోడ్డుపైకి మురుగునీరు



జాతీయరహదారి 161 సర్వీస్‌రోడ్డుపై నిలిచిపోయిన మురుగునీటి దృశ్యం

**చౌటకూరు, జనవరి 2, ప్రభాతవార్త:**
జాతీయరహదారి 161లో మండలకేంద్రమైన చౌటకూరు వద్ద ఏర్పాటుచేసిన సర్వీసురోడ్డు మురుగునీటితో నిండుకుపోవడంతో ప్రజలు ప్రయాణానికి పాట్లు పడుతున్నారు. జాతీయరహదారి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా గ్రామం నుంచి ప్రవహిస్తున్న మురుగునీరు రోడ్డుపై వచ్చి పారుతుండటంతో రోడ్డు మొత్తం మురుగునీటితో నిండుకుపోతోంది. ఆటుగా ప్రయాణించే పాదచారులు, వాహనచోదకులు ప్రయాణానికి పాట్లుపడాల్సి వస్తోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు సమస్యలను విన్నవించినా ప్రయోజనం లేకుండాపోతోందని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించకుంటే జాతీయరహదారిపై ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. జాతీయరహదారిపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని జాతీయరహదారి అధికారులకు సూచిస్తున్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ టౌన్, జనవరి 2, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ఆయామండలాలకు చెందినవారు అనారోగ్యంతో అవస్థలు పడుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధిపథకంలో ఎల్‌ఓసిలను మంజూరు చేయించి బాధిత కుటుంబాలకు అందచేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నారాయణఖేడ్ మండలానికి54, మనూర్ మండలానికి17, నిజాంపేట్ మండలానికి20, కల్హేర్ మండలానికిచెందిన 10మంది బాధితులకు సిఎంఆర్‌ఆర్ ఎల్‌ఓసిలు అందచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన ప్రతి పేదవారు ఆరోగ్యంగా ఉండేందుకు మెరుగైన చికిత్స అందుకునేందుకు ఆరోగ్య శ్రీ పథకంలో 10 లక్షల వరకు వైద్య సౌకర్యం అందుకునే వెసులు మాటు ప్రభుత్వం కల్పించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల్లోని గ్రామాల బాధిత కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు



విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేయిస్తున్న వార్డుకౌన్సిలర్ లతారమేశ్‌యాదవ్

**నర్సాపూర్, జనవరి 2, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మున్సిపాలిటీపరిధిలోని 2వ వార్డులో ఆవార్డ్‌కౌన్సిలర్ లతా రమేష్‌యాదవ్ తన సొంతనిధులతో విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేయడం జరిగింది. ఈసందర్భంగా వార్డ్‌కౌన్సిలర్ లతారమేష్‌యాదవ్ మాట్లాడుతూ 2వ వార్డులో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు లేనందున వీధిదీపాలు లేక వార్డు ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈమేరకు వార్డుప్రజల ఇబ్బందులను గమనించి విద్యుత్ స్తంభాల ఏర్పాటుకోసం విద్యుత్‌శాఖ అధికారులను కలిసి 2వ వార్డ్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలని కోరినట్లు తెలిపారు. ఈవిద్యుత్ స్తంభాల ఏర్పాటుకయ్యే ఖర్చును సొంతంగా భరించి ఈవార్డులో 5విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేశామని తెలిపారు. ఈవిద్యుత్ స్తంభాలను విద్యుత్‌శాఖ సిబ్బందితో పలుచోట్ల ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. అంతేగాక గతంలో కూడా ఈవార్డులో 11విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా వార్డుప్రజలు కౌన్సిలర్ లతారమేష్ యాదవ్‌ను అభినందించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ లతారమేష్‌యాదవ్‌తోపాటు విద్యుత్‌శాఖసిబ్బంది, వార్డుప్రజలు పాల్గొన్నారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మండల విద్యాధికారి



తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మండల విద్యాధికారి లీలావతి

**వెల్దుర్తి, జనవరి 2, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన మాసాయిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తపస్ 2025 క్యాలెండర్‌ను మండల విద్యాధికారి లీలావతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ధర్మపురి, తపస్ మండల అధ్యక్షులు భద్రయ్య, జిల్లా బాధ్యులు రంగారెడ్డి, ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**జహీరాబాద్‌లో...**



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్మా అధ్యక్షులు కృష్ణారెడ్డి

**జహీరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:**
పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధిలోని మాణిక్‌ప్రభు ఉన్నతపాఠశాలలో పాఠశాల స్థాపించి 4దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా పాఠశాల నూతనసంవత్సరం (2025) క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమానికి ట్రస్మా అధ్యక్షులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బెండి రాచప్ప, నాగన్న పంతులు, రిటైర్ట్ టీచర్ కౌలాస్ మహాదేవ్‌లు హాజరయి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు ఎంపల్లి మల్లికార్జున్, పాఠశాలకార్యదర్శి కత్తకాపు సుభాష్‌రెడ్డి, వ్యవస్థాపకులు వెంకటయ్య, ఉపాధ్యాయులు శివశంకర్, మధు, అరుణ, కల్పన, నాగలక్ష్మి, అనిత, సువర్ణ, సోని, మాణిక్యమ్మ, సుధా, సంధ్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**నాగల్‌గిద్దలో...**



పిఆర్‌టియు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నాగల్‌గిద్ద, జనవరి 2, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన నాగల్‌గిద్దలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం పిఆర్‌టియు నూతన సంవత్సరం (2025) క్యాలెండర్‌ను పిఆర్‌టియు నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి గుండు లక్ష్మణ్, మనూర్, నాగల్‌గిద్ద మండలాల అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, రమేష్, ప్రధానకార్యదర్శి నాగ్‌నాథ్, రాష్ట్రనాయకులు దేవిసింగ్, గణపతి, విజయేందర్‌రెడ్డి, సూర్యకాంత్, వెంకటలక్ష్మి, శశికళ, బాప్‌శెట్టి పాల్గొన్నారు.

**క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కార్పొరేటర్...**



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, జనవరి 2, ప్రభాతవార్త:**
భారతీనగర్ డివిజన్‌పరిధిలోని ఎంఐజికాలనీలోగల సీనియర్ సిటిజన్స్ భవన్‌లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ వారు ఏర్పాటుచేసిన 2025వ సంవత్సర క్యాలెండర్‌ను కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. సీనియర్ సిటిజన్‌లకు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో భెల్‌యూనియన్ నాయకులు రాజునాయక్, సీనియర్ సిటిజన్స్ సభ్యులు వైకుంఠరావు, రామరావు, వెంకట్‌రెడ్డి, దేవేంద్రచారీ, రాధాకృష్ణ, సత్య నారాయణ పాల్గొన్నారు.

**పాపన్నపేటలో...**




పాపన్నపేటలో పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

**పాపన్నపేట, జనవరి 2, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన పాపన్నపేటలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం మండలవిద్యాధికారి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో నూతన సంవత్సర (2025) క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, పిఆర్‌టియు మండలశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పంతులు రాజు, నరేస్, పత్రిక సంపాదకులు వెంకటరామిరెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణమూర్తి, సిహెచ్ వెంకటేశం, అంజాగౌడ్, కృష్ణకాంత్, ప్రవీణ్, వేణుగోపాల్‌రెడ్డి, యాదయ్య, మునావత్ రజిత, పద్మ, మహేష్, అంజనాచారి, సతీష్, మల్లయ్య, సంతోష్, సిద్ధిరాములు, నాగేశ్వర్, జనార్ధన్, మేఘ్య, మోహన్‌రావు, రియాజ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

**కొల్చారంలో...**



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మండలవిద్యాధికారి సత్యనారాయణ రావు

**కొల్చారం, జనవరి 2, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని మండల వనరుల కేంద్రం ముందు గురువారం తపస్ 2025 క్యాలెండర్‌ను మండల విద్యాధికారి సత్యనారాయణ రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తపాస్ మండల అధ్యక్షులు సిద్దు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బాధ్యులు రాజేశ్వర్, శ్రీధర్ రెడ్డి, లక్ష్మి నారాయణ, కిషన్, సురేందర్, తిరుమల రెడ్డి, ప్రవీణ్, కృష్ణ, వీరకుమార్, సతీష్, క్రిష్ణ, రాజు, ఆనంద్ కుమార్ తదితరులు ఉన్నారు.

**నర్సాపూర్‌లో...**

**నర్సాపూర్, జనవరి 2, ప్రభాతవార్త:**
నర్సాపూర్‌పట్టణంలోని ఆథరైజ్డ్ టెక్స్‌మోడీలర్ మాణిక్యంగౌడ్ షాప్‌లో 2025 నూతన సంవత్సర టెక్స్‌మో డైరీ, క్యాలెండర్‌ను నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ గురుస్వామి దుర్గప్పగారి అశోక్ గౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సుఖసంపదలతో విలసిల్లాలని కోరారు. అదేవిధంగా నర్సాపూర్ టెక్స్‌మోడీలర్ మాణిక్యంగౌడ్ వ్యాపారంలో అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దుర్గాప్పగారి అశోక్‌గౌడ్ గురుస్వామితో పాటు టెక్స్‌మోడీలర్ మాణిక్యంగౌడ్, నాయకులు గోపి, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.